# నేనూ మేల్కొనే వున్నాను



నల్లగా ఉన్న కంటిపాపకు చల్లగా వున్న చీకటిలో ఏం కనిపించడం లేదు. శరీరంలోని సర్వశక్తులు చూపులో కేంద్రీకరిస్తే అక్కడక్కడ తళుకుమంటోంది.

ఊరు నిద్దరోతోంది. ఇళ్ళు నిద్దరోతున్నాయి. మేడలు పడుకున్నాయి. చెట్లు కదలడం లేదు. కొమ్మ ఆడడం లేదు. ఇంత నిశ్శబ్దంలోనూ అంతటా అలుముకున్నది ఒకే ఒక్కటి చీకటి. హరుడి జటా జూటంలా ఆకాశం నుంచి నేలదాకా కమ్ముకున్నది చీకటి.

వీధి అరుగుల మీద పగలల్లా కష్టపడి పనిచేసిన పాలేళ్ళు గుర్రుపెట్టి నిద్దరోతున్నారు. లోపల గ్రామపెద్ద వీరాస్వామి మీసాలు నిద్దరబోతున్నాయి. అప్పటిదాకా కరణం మీద పన్నిన కుట్ర నిద్దరబోతోంది. "లేకపోతే తన వాళ్ళ పొలం తాను స్వాధీనం చేసుకుంటే వారసత్వం దావా వేయిస్తాడా? ఇంతటివాడ్ని కోర్టు కీడిపిస్తాడా? నలుగురిలో పంచాయితీ పెట్టిస్తాడా? పెద్దే మాత్రం ఏం జరిగింది గనక. ఒక్కడు నోరువిప్పి తనకు వ్యతిరేకంగా చెప్పలేదే? ఎక్కడికి బోతాడు బక్కటోడు? పొలంలో కోతలవుతున్నాయిగా! కుప్పలు కొంపకి చేరినప్పటి మాట గదా!" అనుకుని హాయిగా నిద్రబోతున్నాడు వీరాస్వామి. చెంద్రనిప్పుల వీరాస్వామికి, నెత్తుటేళ్ళ వీరాస్వామికి, కత్తిపోట్ల వీరాస్వామికి దూరంగా వుందామని కాబోలు చీకటి ముందుకెళ్ళింది. అయినా ఆ యింట వెలుగులేదు. ఆ మూల మంచం మీద సుశీల చీకట్లో తనలో తాను నవ్వుకుంటోంది. నిద్రలో ఉలిక్కిపడి పరవశించి పోతోంది. అత్తవారికి మిగిలిన కట్నం ఇవ్వలేదని తనని అత్తింటికి తీసుకెళ్ళకపోతే ఆరేళ్ళు అరణ్యవాసంలా

గడిపింది పుట్టింట్లో. తన తోటివాళ్ళు హాయిగా కాపురాలు చేసుకుంటూ, గుళ్ళో దేవదర్శనం అయిన తరువాత సంజెవేళ మంటపంలో ఒంటరిగా కూర్చుని ముచ్చట్లాడుకుంటూ తొలిచూలు బిడ్డని గర్వంగా భర్త చేతి కందించినప్పుడు అతగాడు కృతజ్ఞతగా నవ్వితే పరవశం పొందుతూ, పాపలు 'అమ్మా అమ్మా' అని పిలుస్తుంటే పాలిండ్లు పొంగగా గుండెలకు హత్తుకుంటూ కాలం గడపగా తాను ఒంటరియై వెలిగించని దీపంసెమ్మాలా దిగులుగా చుక్కలు లెక్కబెట్టుకుంటూ, చీకటి కొలుచుకుంటూ కాలం వెళ్ళదీసింది. చీకటడుగుతోంది "ఏవమ్మా ఇంత కాలానికి సూర్యుడొచ్చాడా ఎందుకింత సంబరం" అని. చీకటే జవాబు చెప్పింది. "తండ్రి మాస్టరీ నుంచి రిటైరైపోతే ప్రభుత్వం దగ్గర దాచుకున్న డబ్బు పెద్ద మొత్తంగా వస్తుందట. అప్పులు, తాకట్లు అవతల పెట్టి ఆ డబ్బుతో అమ్మాయిని అల్లుడి దగ్గరకు పంపుతాను" అన్నాడాయన. అందుకు ఆ సంతోషం.

అంత సంతోషంలోనూ ఆగిపోయి నిద్రలో కుళ్ళి కుళ్ళి ఏడ్చింది సుశీల.

"ఆ డబ్బుతో నన్నత్తింటికి పంపితే ఆ తరువాత అయ్యకు అన్నమెట్లాగూ?" అని.

ఫ్యాక్టరీ ముందు కాపలా కాసే వెంకన్న కూడా కునుకుతున్నాడు. ఊరంతా నిద్రపోయినా తానెప్పుడూ మెలుకువతో వుండే వెంకన్న ఈనాడు జోగుతున్నాడు. మీసకట్టురానప్పటినుంచీ కాపలాకాస్తున్నాడు. పండగనాడు సైకిలు కట్టుపంచె కట్టుకుని పల్లవీధిలో నడిచి వెళ్తుంటే ఓ ఇంటిముందు కిల కిల నవ్వు వినిపించింది. వెనక్కి తిరిగి చూస్తే సుబ్బి బంతిపూల జడ ముందుకేసుకుని ఆ పూవుల చాటునుంచి తనను ఓరగా చూస్తోంది. ఆ మరునాడే సుబ్బిని మనువాడాడు. రాత్రిళ్ళు కాపలా కాస్తూ సుబ్బినే తలుచుకునేవాడు. ఈ ఉద్యోగాన్ని తిట్టుకునేవాడు. వెన్నెట్లో వేగిపోయేవాడు. కాని,నిద్ర పోయేవాడు కాదు. సంవత్సరం క్రితం తెల తెలవారుతుండగా సుబ్బికోసం తహతహలాడుతూ పరుగున పరుగున గుడిసెకొస్తే తలుపులు బార్లా తీసున్నాయి. ఊరంతా వెతగ్గా, నలుగురినీ అడగ్గా తేలిందేమంటే "సుబ్బి రంగడితో లేచిపోయిందని."

ఆనాటినుంచి వెంకన్న కూడా జోగుతున్నాడు.

పెద్ద బజార్లో చీకటి పక్కబరుచుకుంది. సగం కట్టి ఆపేసిన రథశాల దిగులుగా చూస్తోంది. గాలిగోపురంలో పావురాళ్ళు కువకువ లాడ్డంలేదు. ఎదురుగా పెద్ద రథం అలిసిపోయి చీకట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఐరావతంలా వుంది. నిన్న రథయాత్ర రోజు ఎంత సందడి. ఎందరు జనం. దేవుడి విగ్రహాలు వూరేగింపుగా వస్తుంటే ఏమి తోసుకోటాలు. ఒక పక్క చెరుకుగడ నముల్తూ "హర హర మహాదేవ" అని కేకలు, చెక్క భజనల్లకి లయగా వూగుతూ తల వూపడాలు, కన్నె పిల్లల మెడల గంధపు వాసనలు. వేంచేపు చేసిన స్వామి విగ్రహాల వైపు చూస్తూ భక్తి పారవశ్యాన కొన్ని వందలమంది రథం మోకు పుచ్చుకుని జండా ఊపగానే"శంభో" అని ఆకాశం అదిరేట్లు అరుస్తూ రధాన్ని లాగుతూంటే, నలిగిపోయిన పాదాలు. ఆ విసురుకి కిందపడ్డ మనుషులు. స్వామి నివేదనల కోసం గాలిలో కెగరేసే అరటిపండ్లు, కొమ్ముబూరలకు తోడు పిల్లల బూరలు. చెట్లెక్కిన జనం, మేడలెక్కిన జనం, తండ్రుల బుజాలెక్కిన బుడతలు. అందరూ వెళ్ళిపోయాక అర్ధరాత్రి సమయాన ఆ వీధి వుందయ్యా! కడిగేసిన వంటిల్లులా, ఖాళీ ఎడ్లబండిలా చీకట్లో నిశ్శబ్దం అయింది.

అంతటా నిశ్శబ్దపు చీకటి.

అంతటి నిశ్శబ్దంలో ఎక్కడో చిరు సవ్వడి. అది కృష్ణ వొడ్డు. అంత పెద్ద చింతచెట్లు కదలక మెదలక మూగవోయిన వేళ కృష్ణమ్మ సన సన్నగా ముందుకెళ్తోంది. గలగల మోత లేదు. కిలకిల నవ్వులేదు. తక్కుతూ తారుతూ చీకట్లో కలిసిపోయి ముందుకెళ్తోంది. కృష్ణమ్మ అడుగు తడబడ్డప్పుడు అందె మోగినట్టు ఉండుండి చేపపిల్ల చెంగున ఎగురుతోంది. తక్కువ శృతిలో తంబురా వేసినట్టు సాగిపోతోంది కృష్ణ. భూమాత కాటుక కన్నులా వుంది కృష్ణ. సర్వదా జాగృతమైన ఆత్మలా కన్నుమూయలేదు కృష్ణ

"నేనూ మేల్కొనే వున్నాను" అంది గాలికి మోగిన గుడి ధ్వజస్తంభపు చిరు గంట --- *